పోత్గల్ టు ప్రపంచకప్

అండర్-19 వరల్డ్‌కప్‌లో అవినాశ్‌రావు ● భారత జట్టుకు ఎంపికైన రాజన్న సిరిసిల్ల బిడ్డ ● ఎమ్మెల్యే కేటీఆర్ అభినందనలు

'కృషి ఉంటే మనుషులు రుషులు అవుతారు..మహా పురుషులు అవుతారు' అని పెద్దలు ఊరికే అనలేదు. కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా ఉంటుంది. చిన్నతనం నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్న యువకుడు దేశం తరపున ప్రపంచకప్ ఆడబోతున్నాడు. అతను మరెవరో కాదు రాజన్న సిరిసిల్ల జిల్లా పోత్గల్ గ్రామానికి చెందిన ఎరవల్లి అవినాశ్‌రావు. ఇటీవలే బీసీసీఐ ప్రకటించిన యువ భారత్ జట్టుకు ఎంపికయ్యాడు. గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్న అవినాశ్ ప్రతిభకు జాతీయ సెలెక్టర్లు పట్టం కట్టారు. వికెట్‌కీపర్, బ్యాటర్‌గా అదరగొడుతున్న అవినాశ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 14: వస్త్ర పరిశ్రమలో దేశవ్యాప్త ఖ్యాతి గడించిన రాజన్న సిరిసిల్ల జిల్లా క్రికెట్ పోటీల్లోనూ అంతర్జాతీయ కీర్తి కెక్కనున్నది. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న అండర్-19 వరల్డ్‌కప్ టోర్నీకి ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన యువ క్రికెటర్ ఎరవల్లి అవినాశ్ రావు వికెట్ కీపర్‌గా ఎంపికయ్యాడు. మెగా టోర్నీకి ఎంపిక కావడంపై అతన్ని అభినందిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ట్వీట్ చేశారు.

> అండర్-19 ప్రపంచకప్‌తో పాటు దక్షిణాఫ్రికా ముక్కోణపు సిరీస్‌కు ఎంపికైన ఎరవల్లి అవినాశ్‌రావుకు హృదయపూర్వక అభినందనలు. అద్భుత ప్రతిభ కల్గిన ఈ క్రికెటర్ మన రాజన్న సిరిసిల్ల పోత్గల్‌కు చెందిన యువకుడు కావడం విశేషం.
>
> - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పోత్గల్ నుంచి హైదరాబాద్‌కు..

ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన ఎరవల్లి లక్ష్మణ్‌రావు, సుష్మ హైదరాబాద్‌లో ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. 20 ఏండ్ల క్రితం వీరు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలసపోయి అక్కడే స్థిరపడ్డారు. వీరికి ఒక కూతురు, కొడుకు ఉన్నారు. కొడుకు అవినాశ్‌రావు 5వ తరగతి నుంచి క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. చదువుకుంటూనే స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేవాడు. ఇంటర్‌లో ఓ ప్రైవేటు కళాశాలలో చేరి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకున్నాడు. ఆటలో రాణిస్తున్న అవినాశ్‌ను హెచ్‌సీసీ గుర్తించింది. పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో అవకాశం కల్పించింది. అందులోనూ ఆయన తన ప్రతిభ చూపాడు. ప్రస్తుతం దుబాయ్‌లో జరుగుతున్న అండర్-19 ఆసియా కప్ టోర్నీలో యువ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

అవినాశ్ తల్లిదండ్రులు ప్రస్తుతం దుబాయ్‌లోనే ఉన్నారు. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా వేదికగా జరుగనున్న అండర్-19 ప్రపంచ క్రికెట్ పోటీలకు బీసీసీఐ భారత జట్టును ఎంపిక చేసింది. తెలంగాణ నుంచి అవినాశ్‌తో పాటు మురుగన్ అభిషేక్ కూడా ఎంపికయ్యాడు. ప్రపంచకప్‌లో పోత్గల్ యువకుడు ఆడనున్న నేపథ్యంలో జిల్లా వాసులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అమ్మాయిలు అదుర్స్

- **తొలి రోజే 410/7 స్కోరు**
- **ఇంగ్లండ్ మహిళలతో ఏకైక టెస్టు**

ముంబై: బ్యాటర్లు సమిష్టిగా కదం తొక్కడంతో.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత మహిళల క్రికెట్ జట్టు రికార్డు స్కోరు చేసింది. గురువారం ప్రారంభమైన ఏకైక టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన హర్మన్‌ప్రీత్‌కౌర్ బృందం.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 410 పరుగులు చేసింది. మహిళల టెస్టు క్రికెట్‌లో తొలి రోజే ఒక జట్టు నాలుగొందల పైచిలుకు పరుగులు చేయడం ఇది రెండోసారి మాత్రమే. దాదాపు రెండేండ్ల తర్వాత ఆడుతున్న తొలి టెస్టులో మనవాళ్లు విజృంభించారు. సతీశ్ సుభ (69; 13 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (68; 11 ఫోర్లు), యస్తిక భాటియా (66; 10 ఫోర్లు, ఒక సిక్సర్), దీప్తి శర్మ (60 బ్యాటింగ్; 9 ఫోర్లు, ఒక సిక్సర్) అర్ధశతకాలతో అదరగొట్టారు. ఓపెనర్లు స్మృతి మంధన (17), షఫాలీ వర్మ (19) ఎక్కువసేపు నిలువలేకపోగా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (49), స్నేహ్ రాణా (30) రాణించారు. ఇంగ్లిష్ అమ్మాయిల చేతిలో టీ20 సిరీస్ కోల్పోయిన టీమ్‌ఇండియా.. సుదీర్ఘ ఫార్మాట్‌లో దంచికొట్టింది. ఆరంభం నుంచే ధాటిగా ఆడుతూ బౌలర్లపై పైచేయి సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్ రెండు వికెట్లు పడగొట్టింది.

అనధికారిక టెస్టు 'డ్రా'

పోచెఫ్‌స్ట్రోమ్: దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ప్రారంభానికి ముందు భారత్-'ఎ', దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరిగిన తొలి అనధికారి టెస్టు 'డ్రా'గా ముగిసింది. సుదీర్ఘ ఫార్మాట్‌కు తగిన సన్నద్ధత కోసం ఈ మ్యాచ్ నిర్వహించగా.. దక్షిణాఫ్రికా -'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 319 పరుగులు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం భారత్-'ఎ' 417 రన్స్ కొట్టింది. ప్రదోశ్ రంజన్ (163; 23 ఫోర్లు, ఒక సిక్సర్) భారీ సెంచరీ చేయగా.. సర్ఫరాజ్ ఖాన్ (68), శార్దూల్ ఠాకూర్ (76; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 152/2తో నలిచింది. యాసీన్ వల్లి (72 నాటౌట్), జీన్ డు ప్లెసిస్ (50 నాటౌట్) రాణించారు.

సూర్యప్రతాపం

సారథి సూపర్ సెంచరీ ● కుల్దీప్‌కు ఐదు వికెట్లు

మూడో టీ20లో భారత్ జయభేరి

1-1తో సిరీస్ సమం

సారథి ముందుండి నడిపించిన పోరులో టీమ్‌ఇండియా విజయం సాధించింది. వర్షం అంతరాయం మధ్య సాగిన రెండో టీ20లో ఓటమి పాలైన భారత్.. ఆఖరి పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బ్యాటింగ్‌లో సూర్యకుమార్ సెంచరీతో చెలరేగగా.. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ హాఫ్‌సెంచరీతో రాణించాడు. అనంతరం చైనామన్ కుల్దీప్ యాదవ్ పాంచ్ పటాకా మోగిస్తూ.. దక్షిణాఫ్రికా బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేశాడు. ఫలితంగా పొట్టి సిరీస్ సమం కాగా.. ఇరు జట్ల మధ్య ఆదివారం నుంచి వన్డే సమరం షురూ కానుంది.

జొహన్నెస్‌బర్గ్: బ్యాటర్ల మెరుపులకు బౌలర్ల సహకారం తోడవడంతో భారత జట్టు ఘనవిజయం సాధించింది. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా జరిగిన తొలి సిరీస్‌ను టీమ్‌ఇండియా సమం చేసింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది. గురువారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 106 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 2015 తర్వాత భారత జట్టు దక్షిణాఫ్రికాలో టీ20 సిరీస్ కోల్పోని రికార్డును కొనసాగించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (56 బంతుల్లో 100; 7 ఫోర్లు, 8 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి నాలుగో సెంచరీ నమోదు చేసుకోగా.. యశస్వి జైస్వాల్ (41 బంతుల్లో 60; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించాడు. శుభ్‌మన్ గిల్ (8), తిలక్ వర్మ (0), రింకూసింగ్ (14), జితేశ్ శర్మ (4), రవీంద్ర జడేజా (4) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కేశవ్ మహరాజ్, లిజాడ్ విలియమ్స్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 13.5 ఓవర్లలో 95 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎయిడెన్ మార్క్‌రమ్ (25; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), డేవిడ్ మిల్లర్ (35; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడగా.. తక్కినవాళ్లు విఫలమయ్యారు. హెన్రిక్స్ (8), బ్రీట్జ్ (4), క్లాసెన్ (5), ఫెలుక్వాయో (0) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుస కట్టారు. ఆరంభం నుంచే బౌలర్లు పట్టు బిగించడంతో దక్షిణాఫ్రికా బ్యాటర్లు పరుగులు రాబట్టేందుకు తీవ్రంగా తడబడ్డారు. ఆరంభంలో పేసర్లు సత్తాచాటితే.. ఆ తర్వాత స్పిన్నర్లు ప్రభావం చూపారు. కుల్దీప్ బంతి అందుకున్నాక ప్రొటీస్ కనీస ప్రతిఘటన లేకుండానే వెనుదిరిగారు. మన బౌలర్లలో కుల్దీప్ యాదవ్ 5, జడేజా రెండు వికెట్లు పడగొట్టారు. సూర్యకుమార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఆదివారం తొలి వన్డే జరగనుంది.

4 అంతర్జాతీయ టీ20ల్లో సూర్యకుమార్‌కు ఇది నాలుగో సెంచరీ. మ్యాక్స్‌వెల్, రోహిత్ శర్మ సరసన సూర్య చేరాడు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 201/7 (సూర్యకుమార్ 100, యశస్వి 60; కేశవ్ 2/26, లిజాడ్ 2/46), **దక్షిణాఫ్రికా:** 13.5 ఓవర్లలో 95 ఆలౌట్ (మిల్లర్ 35, మార్క్‌రమ్ 25; కుల్దీప్ 5/17, జడేజా 2/25).

వార్నర్ భారీ సెంచరీ

- **ఆస్ట్రేలియా 346/5**
- **పాకిస్థాన్‌తో తొలి టెస్టు**

పెర్త్: విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (164; 16 ఫోర్లు, 4 సిక్సర్లు) భారీ సెంచరీతో చెలరేగడంతో పాకిస్థాన్‌తో జరుగుతున్న మొదటి టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతున్నది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ గురువారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 346 పరుగులు చేసింది. ఈ సిరీస్‌తో టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్న వార్నర్.. పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పరిమిత ఓవర్ల తరహాలో ధనాధన్ ఆటతో చెలరేగాడు. మరో ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా (41), ట్రావిస్ హెడ్ (40) రాణించారు. మిషెల్ మార్ష్ (15), అలెక్స్ కారీ (14) క్రీజులో ఉన్నారు. పాకిస్థాన్ బౌలర్లలో జమాల్ రెండు వికెట్లు పడగొట్టాడు.

కేకేఆర్ కెప్టెన్‌గా శ్రేయస్

కోల్‌కతా: భారత మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్.. వచ్చే ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. వెన్నెముక గాయం కారణంగా ఈ ఏడాది ఐపీఎల్‌కు దూరమైన శ్రేయస్.. శస్త్రచికిత్స అనంతరం తిరిగి మైదానంలో అడుగుపెట్టాడు. శ్రేయస్ గైర్హాజరీలో ఈ ఏడాది కేకేఆర్ టీమ్‌కు నితీశ్ రాణా కెప్టెన్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈసారి నితీశ్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని ఫ్రాంచైజీ వెల్లడించింది. ఆసియాకప్‌తో పునరాగమనం చేసిన శ్రేయస్.. వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసి ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

భారత్‌కు చుక్కెదురు

జూనియర్ హాకీ ప్రపంచకప్

కౌలాలంపూర్: ప్రతిష్ఠాత్మక జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో యువ భారత్‌కు చుక్కెదురైంది. గురువారం జరిగిన సెమీస్‌లో భారత్ 1-4 తేడాతో జర్మనీ చేతిలో ఓటమిపాలైంది. ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో టీమ్ ఇండియాకు 12 పెనాల్టీ కార్నర్ అవకాశాలు దక్కగా ఒక్క దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. భారత్ తరపున సుదీప్ (11ని) ఏకైక గోల్ చేయగా, జర్మనీ జట్టులో బెన్ హస్‌బాచ్(8ని, 30ని), గ్లెండర్ పాల్(41ని), ఫ్లోరన్ స్ప్రెర్లింగ్(58ని) గోల్స్ చేశారు. శనివారం జరిగే కాంస్య పోరు కోసం భారత్ పోటీకి దిగనుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.